| Article Date | Headline / Summary | Publication |
| --- | --- | --- |
| 05 Dec 2025 | Can take loan for car? | Eenadu |

# కారు రుణం తీసుకోవచ్చా?

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని. మరో రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నాను. ఇప్పటి నుంచి నెలకు రూ.50వేల వరకూ ఏదైనా పెట్టుబడి పథకంలో మదుపు చేయాలని అనుకుంటున్నా. నెలకు కనీసం రూ.40 వేల వరకూ రావాలంటే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలి? - హరిత**



రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నారు కాబట్టి, మీ డబ్బు కాస్త సురక్షితంగానే ఉండేలా చూసుకోవాలి. రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత, మరో మూడేళ్లపాటు వేచి చూస్తే మంచిది. రూ.50వేల పెట్టుబడి కోసం మల్టీ అసెట్ లేదా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లను పరిశీలించవచ్చు. ఇలా వేచి చూసినప్పుడు మీ డబ్బు పెరుగుతుంది. నెలకు రూ.40వేలు మీకు వెనక్కి రావాలంటే.. కనీసం 8 శాతం రాబడినిచ్చే పథకాల్లో రూ.60లక్షల వరకూ జమ చేయాల్సి ఉంటుంది.

మార్గదర్శి

**నా వయసు 32. మూడేళ్లుగా పీపీఎఫ్‌లో నెలకు రూ.10వేల చొప్పున జమ చేస్తూ వస్తున్నాను. దీనికి బదులుగా షేర్లలో పెట్టుబడి పెడితే లాభం వస్తుందని అంటున్నారు. నిజమేనా? - శేఖర్**

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) ప్రభుత్వ హామీ ఉన్న పథకం. దీంతో షేర్లను పోల్చలేం. ప్రస్తుతం పీపీఎఫ్‌లో 7.1 శాతం పన్ను రహిత వడ్డీ అందుతోంది. షేర్లలో దీర్ఘకాలం పెట్టుబడి పెడితే లాభం వస్తుంది. కానీ, నష్టభయమూ ఉంటుందని మర్చిపోవద్దు. షేర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. ఇది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. పీపీఎఫ్‌లో రూ.3వేలు కొనసాగించండి. మిగతా రూ.7వేలు డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో కనీసం 10ఏళ్లకు మించి పెట్టుబడి పెట్టండి. సాధ్యమైనప్పుడల్లా పెట్టుబడి పెంచుకోండి.

**నా దగ్గర రూ.15 లక్షలున్నాయి. కారు కొనాలనే ఆలోచన ఉంది. రుణం తీసుకొని, కారు కొనడం మంచిదా? నా దగ్గర ఉన్న మొత్తంతో ఎలాంటి అప్పు లేకుండా తీసుకోవాలా? ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న ఈ మొత్తాన్ని అధిక రాబడి వచ్చేలా ఎక్కడ మదుపు చేయాలి? - కరుణాకర్**

ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు, రుణాలపైన వడ్డీ రేట్లు తక్కువగానే ఉన్నాయి. ఇప్పుడు ఏడాది చివర్లో ఉన్నాం కాబట్టి, కార్లపైన మంచి రాయితీ లభించే అవకాశం ఉంది. బ్యాంకులో కారు రుణం 7.5-9శాతం మధ్యలో వచ్చే అవకాశం ఉంది. కారు రుణం తీసుకుంటే నెలనెలా ఈఎంఐ చెల్లించాలి. దీనికి ఇబ్బందేమీ లేదు అనుకుంటే.. రుణం తీసుకోండి. మీ దగ్గరున్న మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో కనీసం ఏడేళ్లకు మించి మదుపు చేయండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

**నేను ఒక నకిలీ షాపింగ్ వెబ్‌సైటులో నా క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేశాను. దీంతో నా కార్డులో ఉన్న మొత్తం అంతా నష్టపోయాను. దీనికి సైబర్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందా? ఏం చేయాలి? - నవీన్**

నకిలీ షాపింగ్ వెబ్‌సైటులో డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలు ఇచ్చి, డబ్బు కోల్పోయిన సందర్భాల్లో సైబర్ ఇన్సూరెన్స్ పాలసీ ఆ ఆర్థిక నష్టాన్ని భర్తీ చేయగలదు. కానీ, ఇది మీ పాలసీలో ఏ రకం కవరేజీలు తీసుకున్నారన్న దాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

ఈ రోజుల్లో చాలా సైబర్ ఇన్సూరెన్స్ పాలసీలు ఫిషింగ్ మోసాలు, నకిలీ ఆన్‌లైన్ లావాదేవీలు, అనధికార నిధుల బదిలీల నుంచి వ్యక్తులను రక్షిస్తాయి. మీరు నకిలీ వెబ్‌సైట్‌లో కార్డు వివరాలు నమోదు చేశారు కాబట్టి, ఇది సాధారణంగా ఫిషింగ్ కవర్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ కవర్ కిందుకు వస్తుంది. మీ పాలసీ నిబంధనలను ఒకసారి చూసుకోండి. అనధికారిక లావాదేవీల రక్షణ ఉంటే, మీరు మోసపోయిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. మీరు నిజంగా సైబర్ నేరానికి బాధితులు అని నిరూపణ అయ్యాకే పరిహారం లభిస్తుంది.

✦ సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే కార్డును బ్లాక్ చేయించాలి.

✦ స్థానిక సైబర్ క్రైమ్ లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి.

✦ మోసం గురించి 24-48 గంటల్లోపు బీమా కంపెనీకి తెలియజేయాలి.

✦ బ్యాంకు స్టేట్‌మెంట్‌తో పాటు, ఎఫ్ఐఆర్ కాపీ, నకిలీ వెబ్‌సైట్‌తో మీరు చేసిన లావాదేవీలకు సంబంధించిన వివరాలు (స్క్రీన్‌షాట్, డాక్యుమెంట్లు) ఉంటే సమర్పించాలి.

బీమా సంస్థ నిజంగా సైబర్ మోసం జరిగిందని ధ్రువీకరించుకున్న తర్వాత, పాలసీ నిబంధనల మేరకు పరిహారం అందిస్తుంది.

**- అమర్‌నాథ్ సక్సేనా**
**చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ (కమర్షియల్), బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్.**